క్లుప్తంగా

రవిరెడ్డికి అభినందనలు



రవిరెడ్డిని అభినందిస్తున్న నాయకులు

కొమ్మాది: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన జి.రవిరెడ్డిని ఎండాడలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం పలువురు నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, అప్పల నాయుడు, సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ వంకాయల మారుతి ప్రసాద్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ సకల భక్తుల ప్రసాద్, 7వ వార్డు సెక్రటరీ టీవీజీ అప్పారావు, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

జర్మనీలో హిప్ నావిగేషన్ కోర్సుకు అపోలో వైద్యుడు



అపోలో వైద్యుడు డాక్టర్ సతీష్

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం హెల్త్‌సిటీలో అపోలో ఆస్పత్రి సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఐ.సతీష్‌కు గొప్ప అవకాశం లభించింది. ఈనెల 21, 22 తేదీలలో జర్మనీ దేశం మ్యూనిచ్‌లో నిర్వహించనున్న స్మిత్ అండ్ నేఫ్యూ అడ్వాన్స్‌డ్ హిప్ నావిగేషన్ కోర్సుకు హాజరుకావాలని ఆహ్వానం అందింది. దీంతో ఆయన మంగళవారం జర్మనీ బయలుదేరి వెళ్లారని అపోలో ప్రతినిధి రామచంద్రరావు తెలిపారు. దేశంలోనే ఇద్దరు వైద్యులకు దీనికోసం ఆహ్వానం అందిందన్నారు. వారిలో విశాఖలో అపోలో ఆస్పత్రి వైద్యుడు ఒకరు కావడం అభినందనీయమన్నారు. రోబోటిక్ టోటల్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలో ఆయనకు ఉన్న అనుభవం వల్ల ఈ శిక్షణకు ఎంపికైనట్లు తెలిపారు.

ఆచార్య లక్ష్మీప్రసాద్‌కు పురస్కారంపై హర్షం



లక్ష్మీప్రసాద్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం హిందీ విభాగం గౌరవాచార్యులు, మాజీ రాజ్యసభ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కి ఇంటలెక్చువల్ ఆఫ్ ది ఇయర్ 2024 పురస్కారం లభించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రిఫాసిమెంటో ఇంటర్నేషనల్ సంస్థ బోర్డ్ ఆఫ్ ఎడిటర్స్ ఈ పురస్కారాన్ని ఆచార్య లక్ష్మీప్రసాద్‌కు బహూకరించి సత్కరించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆచార్య లక్ష్మీప్రసాద్‌ను అభినందించారు. ఆచార్యులు సాధించే పురస్కారాలు, అవార్డులు, వర్సిటీ ప్రతిష్టను ఇనుమడింపజేస్తాయన్నారు.

సెమినార్ ప్రొసీడింగ్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం జాగ్రఫీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అర్బన్ డెవలప్‌మెంట్, ఎన్విరాన్‌మెంట్ ఇన్ 21 సెంచరీ–ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ సదస్సు ప్రొసీడింగ్స్ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఆవిష్కరించారు. ఇటీవల విభాగం ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్ సహకారంతో నిర్వహించిన రెండు రోజుల సదస్సులో భాగంగా భూవిజ్ఞాన శాస్త్ర ఆచార్యులు, శాస్త్రవేత్తలు ప్రసంగాలు పుస్తకంలో ప్రచురించారు. కార్యక్రమంలో ఆచార్య టి.వి కృష్ణ, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య హేమమాలిని, పి.సునీత, అనూజ టిగ్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పరుగులు

- 28వ వార్డులో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు
- 6 పార్కులు, 4 సామాజిక భవనాలు, సచివాలయ నిర్మాణం



రామ్‌నగర్‌లో బీటీ రోడ్డు



రూ.3.63 కోట్లతో అభివృద్ధి చేసిన దసపల్లాహిల్స్ పార్కు



నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ గుడి ద్వారం

బీచ్‌రోడ్డు: గత ప్రభుత్వం విశాఖ అభివృద్ధిని విస్మరిస్తే..ఇప్పుడున్న ప్రభుత్వం నగర ఖ్యాతిని విశ్వవ్యాపితం చేసింది. అభివృద్ధి అంటే ఇది కదా..అన్నట్టు ఐదేళ్లకాలంలో ప్రతీ వార్డు మౌలిక వసతులతో కళకళలాడుతోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేసింది. జీవీఎంసీ 28వ వార్డు గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండగా..గత ఐదేళ్లుగా ప్రభుత్వం ఈ వార్డు రూపురేఖలు మార్చేసింది. ఇందుకోసం సుమారు రూ.12 కోట్లు అభివృద్ధి పనులను ఖర్చు చేసింది. జీవీఎంసీ నిధులు రూ.7.36 కోట్లు, స్మార్ట్‌సిటీ నిధుల నుంచి 3.63 కోట్లు, ఎంపీ నిధులు నుంచి రూ.61 లక్షలు, కార్పొరేటర్ తన సొంత నిధులు రూ.13 లక్షలతో వార్డును అభివృద్ధి పథంలో నడిపించారు.

రూ.7.36 కోట్లతో 26 పనులు

వార్డు అభివృద్ధిలో భాగంగా ఐదేళ్లల్లో 28వ వార్డులో రూ.7.36 కోట్లతో 26 అభివృద్ధి పనులను చేపట్టింది. వాటిలో రామ్‌నగర్‌లో ఫౌంటెన్, నెహ్రూనగర్‌లో పార్క్ సంరక్షణకు గ్రిల్స్ ఏర్పాటు, రోయల్ పార్క్ అభివృద్ధి, నెహ్రూనగర్ చిల్డ్రన్ పార్క్, అనిబిసెంట్ పార్కు, ఫ్యాక్టర్ లేఆవుట్ పార్కులను అభివృద్ధి చేశారు. కొత్త నెహ్రూనగర్ సచివాలయాన్ని నిర్మించారు. సంతోషిమాత కాలనీ డ్రైనేజీ, రామ్‌నగర్‌లో కల్వర్ట్, భానోజీనగర్‌లో సీసీ రోడ్డు, పితానిదిబ్బ వద్ద ఫుట్‌బ్రిడ్జ్, సామాజిక భవనం, రామ్‌నగర్, బంగారంమెట్టలో సామాజిక భవనాలు నిర్మించారు. కైలాసమెట్ట, రామ్‌నగర్, నెహ్రూనగర్, దసపల్లాహిల్స్ ప్రాంతాల్లో 11 బీటీ రోడ్లు నిర్మించారు.

స్మార్ట్‌సిటీ నిధులతో ..

స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో 28వ వార్డుకు రూ.3.63 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో దసపల్లాహిల్స్ ప్రాంతంలో నూతన పార్కును అభివృద్ధి చేశారు. దీంతో ఎంతో భయంకరంగా ఉన్న ఈ ప్రదేశం ఇప్పుడు ఎంతో అందంగా నగరవాసులను అలరిస్తోంది.

ఎంపీ నిధులతో..

వార్డు అభివృద్ధికి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తన ఎంపీ నిధులనుంచి రూ.61లక్షలు కేటాయించారు. ఈ నిధులతో రామ్‌నగర్‌లో సామాజిక భవనాలు నిర్మించారు.

కార్పొరేటర్ సొంత నిధులతో.. : జీవీఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా ఎన్నికైన పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ ఇంచార్జి పల్లా దుర్గారావుల సొంత నిధులు రూ. 11 లక్షలతో పలు దేవాలయాలను అభివృద్ధి చేశారు. వాటిలో రామ్‌నగర్‌లోని శ్రీరామాలయం, శ్రీశివానంద ఆశ్రమం స్వామి మఠం, న్యూ పితాని వీధి సామాజిక భవనం మరమ్మతులు, పందిమెట్ట ముత్యాలమ్మ అమ్మవారి గుడి, పితానివీధి బంగారమ్మ దేవాలయాలను అభివృద్ధి చేశారు. భానోజీనగర్ ప్రాంతంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, భానోజీరావు విగ్రహం ఏర్పాటు చేశారు.

సామాజిక భవనాల నిర్మాణం రూ.1.10 కోట్లు	ఫుట్ బ్రిడ్జ్ రూ. 20 లక్షలు
సీసీ రోడ్లు రూ.54 లక్షలు	బీటీ రోడ్లు రూ.4.21 కోట్లు
డ్రైనేజ్ రూ.55 లక్షలు	సచివాలయాల నిర్మాణం రూ.39 లక్షలు
పార్కులు రూ.4.36 కోట్లు	

కళకళలాడుతున్న రహదారులు



జై సంతోషి మాత కాలనీ, న్యూ పితానిదిబ్బ, రామ్‌నగర్ ప్రాంతాలు పదేళ్లగా అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. సరైన డ్రైనేజీలు లేక, రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తరువాత వార్డు అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులను కేటాయించారు. వార్డులో ఏ ప్రాంతానికి వెళ్లిన నూతన రోడ్లు, డ్రైనేజీలతో వార్డు కళకళలాడుతోంది. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ వార్డు అభివృద్ధికి తన నిధులను కేటాయించారు. గ్రామ పెద్దలు, ప్రజలు కోరిక మేరకు చిన్న చిన్న పనులను సొంత నిధులతో చేపట్టాను.

–పల్లా దుర్గారావు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇంచార్జి

ఎన్నికల నిబంధనలపై అవగాహన

మహారాణిపేట: ఎన్నికల నిబంధనలు, కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అవగాహన కల్పించారు. రామ్మూర్తి పంతులు పేట, శివనగర్, బాపూజీనగర్, స్వర్ణభారతి, ఏఎస్ఆర్ నగర్, అంబేడ్కర్‌నగర్ కాలనీ, ఏకేసీ కాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ఎలక్షన్ మోడల్ కోడ్, రాజకీయ నాయకుల ఫొటోలు గల బ్యానర్స్, గోడపత్రికలను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీల్లో రికార్డ్‌లను, రిపోర్ట్‌ను ఆయన పరిశీలించారు.కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేం పని వెలగపూడి..

గోడలకు టీడీపీ స్టిక్కర్లు అతికిస్తున్న చిన్నారులు



ఆరిలోవ: పిల్లలు బడిలోనే ఉండాలి. చక్కగా చదువుకోవాలి.. తెలుగుదేశం నాయకులకు ఇవేం పట్టడం లేదు..చిన్నారులను తమ ఎన్నికల ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు ప్రచార పోస్టర్లను గోడలకు అతికించే పనికి చిన్నారులను పురమాయించారు. మంగళవారం నియోజకవర్గం పరిధి హనుమంతవాక కొండవాలు ప్రాంతాల్లో పిల్లలంతా టీడీపీ స్టిక్కర్లను గోడలకు అతికించారు. ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని పలువురు అభిప్రాయపడుతున్నారు. చదువుకుంటున్న పిల్లలతో ఎన్నికల ప్రచారం చేయించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



హనుమంతవాక తెలుగుదేశం పార్టీ స్టిక్కర్లతో విద్యార్థులు

ఎంవీవీని కలిసిన రామచంద్రరావు, కంచర్ల



ఎంవీవీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామచంద్రరావు, కంచర్ల తదితరులు

ఎంవీపీకాలనీ: టీడీపీ నాయకుడు గంపల వెంకట రామచంద్రరావు, ప్రజారాజ్యం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన కంచర్ల అచ్యుతరావు మంగళవారం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిద్దరూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఇటీవల వైఎస్సార్‌సీపీలోకి చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీ, తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణను కలిసి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం, ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ సీఎం స్ఫూర్తితో రామచంద్రరావు, అచ్యుతరావులు వైఎస్సార్‌సీపీలో చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలకపాత్ర పోషించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



మృతుడు లక్ష్మయ్య

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సుమారు 60 ఏళ్ల పైబడిన లక్ష్మయ్య అనే వృద్ధుడు పెదగదిలి, సంతపాలెం, చినగదిలి ప్రాంతాల్లో ఐదేళ్లు నుంచి యాచన చేస్తుండేవాడు. గత నెల 28న బీఆర్‌టీఎస్ రోడ్డులో హెల్త్‌సిటీలో అపోలో ఆస్పత్రి ఎదురుగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం లక్ష్మయ్యను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన లక్ష్మయ్యను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. లక్ష్మయ్య పూర్తి వివరాలు తెలియకపోవంతో మృతదేహాన్ని మార్చులో భద్రపరిచారు. మృతుడుకి సంబంధించిన బంధువులు, తెలిసినవారు ఎవరైనా ట్రాఫిక్ ఎస్.ఐకు ఫోన్ నంబర్ 8331041606లో సంప్రదించాలని ఆరిలోవ పోలీసులు కోరారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న గోవింద్, ముస్లిం సోదరులు

బీచ్‌రోడ్డు: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ 22వ వార్డులో మంగాపురం కాలనీ తార యూత్ ఇఫ్తార్ విందు నిర్వహించింది. ముఖ్యఅతిథిగా పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతాల గోవింద్ హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేసి విందు స్వీకరించారు.

చిరుధాన్యాలతో 'పిచ్చుకలు'



విజయ్ కుమార్ మిల్లెట్స్‌తో తీర్చిదిద్దిన చిత్రం

ఏయూక్యాంపస్: పర్యావరణంలో ప్రతీ జీవికి ఒక ప్రత్యేకత, ప్రాధాన్యత ఉంటుంది. అనేక జీవులు అంతరించిపోయే ప్రమాదపుటంచులలో ఉన్నాయి. వీటిని రక్షించాల్సిన బాధ్యత, అవసరం మనందరిపైన ఉంది. బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ చిరుధాన్యాలు (మిల్లెట్స్)ని ఉపయోగించి పిచ్చుకల చిత్రాన్ని తీర్చిదిద్దారు. ద్విజామితీయ చిత్రం (2డీ) రూపంలో 24 ఇంచీల పొడవు, 18 ఇంచీల వెడల్పుతో ఈ చిత్రాన్ని క్లే, చిరుధాన్యాలు ఉపయోగించి తయారు చేశారు.

22న మహిళలకు ప్రత్యేక ఆయుర్వేద శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగ కేంద్రం, ధాన్ ఆయుర్వేద రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన మహిళలకు ప్రత్యేక ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య కె.రమేష్ బాబు తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నివారించే విధంగా మహిళలకు అవసరమైన సూచనలు, ఆరోగ్య విధానాలను ఈ శిబిరంలో సూచిస్తారు. యోగా విలేజ్‌లోని ఈ క్లాస్‌రూమ్‌లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ శిబిరంలో ఉచితంగా రక్తంలో చక్కెరశాతం, సీరం కొలస్ట్రాల్, క్రియాటిన్ పరీక్షలు జరుపుతారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు డాక్టర్ నిషితను 7702682345 నంబరులో సంప్రదించాలని సూచించారు.

23న మెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: మెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 23,24వ తేదీల్లో ఏవీఎన్ కళాశాలలో జరగనున్నాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు ప్రోత్సాహకాలను అందించనున్నారు. నాకవుట్ పద్ధతిలో 30 పాయింట్లతో మ్యాచ్ నిర్వహించనుండగా... క్వార్టర్ ఫైనల్స్‌నుంచి బెస్ట్ ఆఫ్ త్రీగా పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

ఉమన్ ఇన్ స్టెమ్ స్కాలర్‌షిప్‌లు

బీచ్‌రోడ్డు: మహిళలు విద్యను అభ్యసించడానికి, స్టెమ్ రంగాల్లో వారి పూర్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు ఉమన్ ఇన్ స్టెమ్ పేరుతో స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు బ్రిటిష్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ ఇండియాన డైరెక్టర్ రిత్తికా చందా ఒక ప్రకటనలో తెలిపారు. యూకేలో విద్యావకాశాలు, సాంస్కృతిక సంబంధాల కోసం బ్రిటిష్ కౌన్సిల్ యూకేలోని యూనివర్సిటీల భాగస్వామ్యంతో స్టెమ్ ప్రోగ్రాంలోని మహిళల కోసం స్కాలర్‌షిప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక స్కాలర్‌షిప్ యూకేలో తమ మాస్టర్స్‌ను అభ్యసించాలనుకునే మహిళా స్టెమ్ గ్రాడ్యుయేట్లు కోసం ఈ ప్రోగ్రాం రూపొందించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు https://www.britishcouncil.in సందర్శించాలని కోరారు..

పార్టీ విజయానికి ఐక్యంగా పనిచేద్దాం



సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

- సీఎం సంక్షేమ పాలనకు విశేష ఆదరణ
- వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



హాజరైన కార్యకర్తలు

ఆరిలోవ: ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనతో జనాదరణ పెరుగుతోందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ పదో వార్డు పరిధి ఆదర్శనగర్‌లో మంగళవారం సాయంత్రం కార్యకర్తలతో 'మేము సిద్ధం, మా బూతు సిద్ధం' సభ నిర్వహించారు. ఈ సభలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ఎంవీవీకి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ మండల అధ్యక్షుడు, ఇన్‌చార్జిలు, కార్యకర్తలు బాధ్యత, చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేసిన విప్లవాత్మకమైన మార్పులు, పేదలకు చేసిన మేలు మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొస్తాయన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పదో వార్డులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ, బూత్ కన్వీనర్లు, వార్డుల ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలనకు అండగా నిలవండి

ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



చేపలు విక్రయిస్తున్న మహిళతో ముచ్చటిస్తున్న ఎంవీవీ

ఎంవీపీకాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర మంగళవారం 19వ వార్డులో కొనసాగింది. ప్రజల నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా యాత్ర కొనసాగింది. మంగళవారం నాటికి యాత్ర 65వ రోజుకు చేరుకుంది. 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మీతో కలిసి ఎంవీపీ ఎంవీపీ కాలనీ సెక్టార్–12, లాసన్స్ బే కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అందించిన సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల జగనన్న సంక్షేమ పాలనకు అండగా నిలవాలని ఓటర్లను కోరారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను సీఎం జగన్ అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడం ద్వారా ఆ సంక్షేమ పాలనకు బ్రహ్మరథం పట్టాలన్నారు. తూర్పు నియోజకవర్గంలో తన గెలుపునకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వసంత, గణేష్‌లతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళా దినోత్సవం



కార్యక్రమంలో మహిళలు

ఆరిలోవ: విశాఖ మారియా మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆరిలోవ అమెరికన్ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇక్కడ సొసైటీకి సంబంధించిన మహిళలు పాల్గొన్నారు. బాలికలు, సొసైటీ మహిళలు ఎంతో ఉత్సాహంగా నృత్యాలు, నాటికలు ప్రదర్శించారు. మహిళలకు రక్షణ, గౌరవించడం, హక్కులు తదితర అంశాలకు సంబంధించిన ప్రాధాన్యత తెలియజేస్తూ ఓ మహిళా బృందం ప్రదర్శించిన నాటిక ఇక్కడ అతిథులు, తోటి మహిళలను అలరించింది. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ సుపీరియర్ సిస్టర్ ఏసీ మారియా, డీఈ ఎడ్యుకేషన్ సెంటర్ ఇన్‌చార్జి సిస్టర్ ఫిలిమినా జోసఫ్, సిస్టర్ నిర్మల మేరీ, సిస్టర్ జి.ఇందిర మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం అనేది అంబేడ్కర్ ఆశయాలలో ఒకటన్నారు. స్త్రీ సృష్టిలో గొప్పదన్నారు. అనంతరం నాటికలు, నృత్యాలు ప్రదర్శించి మహిళలు, బాలికలకు బహుమతులు అందించారు.

నాడీ వైద్యంతో ఆరోగ్యం



మహిళకు సూదితో వైద్యం చేస్తున్న జైశ్రీరామ్ శిష్యుడు..

ఆరిలోవ: నాడీ వైద్యంతో మంచి ఆరోగ్యం కలుగుతుందని హైదరాబాద్‌కు చెందిన సిద్ధ ఆయుర్వేద వైద్యుడు గురూజీ జైశ్రీరామ్ తెలిపారు. సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరాన్ని గో ఆధారిత వ్యవసాయదార్ల సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్ బీవీకే కళాశాలలో మంగళవారం నిర్వహించారు. విశాలాక్షినగర్, ఆదర్శనగర్, ఎంవీపీకాలనీ తదితర ప్రాంతాల నుంచి కీళ్లకు సంబంధించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు అధిక సంఖ్యలో ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందారు. సూదులు, కర్ర సుత్తి తదితర పరికరాలను ఉపయోగించి ఇక్కడ గురూజీ జైశ్రీరామ్, అతని శిష్యులు వైద్యం అందించారు. ఈ సందర్భంగా గురూజీ జైశ్రీరామ్ మాట్లాడుతూ ఈ శిబిరం విశాఖలో ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారని తెలిపారు. సిద్ధ, ఆయుర్వేద, మర్మం విధానంతో అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి నయం చేయవచ్చన్నారు. దీర్ఘకాలిక వెన్ను నొప్పి, స్పాండిలైటిస్, మోకాళ్ల నొప్పులు, కాళ్ల పీకులు ఉన్నవారికి ఈ వైద్యం ద్వారా నయం చేసుకోవచ్చన్నారు. మానవ శరీరంలోని మలినాలను బయలకు తీసేస్తే ఆరోగ్యంగా జీవించడానికి వీలుపడుతుందన్నారు. మనం తినే ఆహారంపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. ఈ శిబిరం బుధవారం సాయంత్రం వరకు కొనసాగుతుందన్నారు. అవసరమైనవారు ఇక్కడ సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్, గో ఆధారిత వ్యవసాయదార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, ప్రకృతి రైతు షణ్ముఖరావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లకు శిక్షణ

మహారాణిపేట: మంచి జీవనశైలితోనే ఆరోగ్యం పదిలమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా స్థాయి కేర్ కంపానియన్ కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. జీవన శైలి సరిగా లేకపోవడం వల్ల వచ్చే వ్యాధులను నివారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి, వైద్యులు బాలాజీ, శ్రీనివాస్, రవిశంకర్, కమ్యునిటీ హెల్త్ ఆర్గనైజర్ సాంబమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన బ్రోచర్, వాల్‌పోస్టర్, బ్యాగ్‌లను ఆవిష్కరించారు.

డీఎంహెచ్‌వోకు వినతి

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని పలువురు కోరారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావును మంగళవారం కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

కనీస వేతనాలు ఉద్యోగ సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, ఇతర నాయకులు, ఆరోగ్యమిత్రలు, టీమ్ లీడర్స్ పాల్గొన్నారు.

సమత కళాశాలలో మెగా వైద్య శిబిరం

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీలోని సమత కళాశాలలో ఉచిత మెగా వైద్యశిరాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, లీ ఫార్మా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. ఈ శిబిరం ద్వారా బీఎంఐ, బీఎండీ, బీపీ, న్యూట్రిషన్ వాల్యూస్, బాడీ కంపోజిషన్ వంటి పరీక్షలు నిర్వహించారు. వందమందికి పైబగా విద్యార్థులతో పాటు అధ్యాపకులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ఆచార్య విజయరవీంద్రతో పాటు శ్రీనివాసరావు, లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి, కో-ఆర్డినేటర్ సరోజిని, డాక్టర్ మేరీ సరళ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.